ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 ၊ కనిష్ఠం 21.6



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

బుధవారం 9 ఏప్రిల్ 2025



పెద్దగుజ్జల్ తండాలో భోజనం చేస్తున్న కలెక్టర్

సంపన్నులతో సమానంగా..
పేదలకు సన్న బియ్యం

• కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సంపన్నులతో సమానంగా పేదలకు సన్న బియ్యంను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం గాంధారి మండలం పెద్దగుజ్జల్ తండాలో బానోత్‌సోఫి, వినోద్ ఇంట్లో కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న బియ్యాన్ని పేద కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామన్నారు. బానోత్ వినోద్ మాట్లాడుతూ ప్రతీనెల 30కిలోల దొడ్డు బియ్యం వచ్చేవని ఎవరం కూడా తినేవాళ్లం కాదన్నారు. సన్న బియ్యంతో కుటుంబంలోని ప్రతీ ఒక్కరం తింటున్నామన్నారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్, ఇతర అధికారులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, డీపీవో మురళి, ఎంపీడీవో రాజేశ్వర్, తహసీల్దార్ రేణుక చౌహన్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల పునర్ వ్యవస్థీకరణ

సహకార సంఘాల ద్వారా ప్రజలకు, రైతులకు సేవలను అందించేందుకు సహకార సంఘాల పునర్ వ్యవస్థీకరణకు జిల్లా సహకార అభివృద్ధి కమిటీ నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో సహకార కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు కమిటీ నిర్ణయించి రాష్ట్రస్థాయి కమిటీకి పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌బాబు, డీఏవో తిరుమల ప్రసాద్, జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీపతి, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి తదితరులు పాల్గొన్నారు.

పోషణ పక్షం పోస్టర్ ఆవిష్కరణ

పోషణ పక్షం పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్, ఐసీడీఎస్ అధికారులు ఆవిష్కరించారు. పోషణ పక్షం కార్యక్రమాన్ని ఈనెల 8 నుంచి ఏప్రిల్ 22 వరకు రోజు వారి షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, కార్యక్రమాలను జన్ అందోళన్ డ్యాష్ బోర్డులో ఎంటర్ చేయాలని తెలిపారు.

ధాన్యం..
కొనుగోళ్లు షురూ



కామారెడ్డి శివారులో వరి కోతలు చేపడుతున్న రైతులు

- జిల్లాలో మొదలైన వరి కోతలు
- ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- జిల్లాలో మొత్తం 446 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఈ సారి మహిళా సంఘాలకు 183 కేంద్రాల కేటాయింపు
- సన్నాలు, దొడ్డు రకం ధాన్యం వేర్వేరుగా కొనుగోలు
- ఇప్పటికే 168 కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- మరో వారం రోజుల్లో పూర్తిగా తెరుచుకోనున్న కొనుగోలు కేంద్రాలు
- జిల్లాలో 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

కామారెడ్డి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యాసంగి సీజన్‌లో వరి కోతలు మొదలయ్యాయి. వ్యవసాయ బావుల కింద సాగు చేసిన వరి పంటలు కోతకు వచ్చాయి. కోతకు వచ్చిన పంటలను కోసేందుకు రైతులు బిజీ అయ్యారు. ఇప్పటికే కొందరు రైతులు వరి కోతలను ప్రారంభించారు. కోత మిషన్‌లు సైతం గ్రామాల్లోని పంట పొలాలకు చేరుకున్నాయి. వరి కొనుగోళ్ల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతులకు గిట్టుబాటు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. ఈ సీజన్‌లో 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. కోతలు మొదలైనందున ఇప్పటికే జిల్లాలో 168 కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ఇప్పుడిప్పుడే వరి కోతలను మొదలు పెట్టడంతో మరో పక్షం రోజుల్లో కొనుగోలు కేంద్రాలకు పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చే అవకాశం ఉందని సంబంధిత శాఖ అధికారులు భావిస్తున్నారు. అప్పటిలోగా కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు జిల్లా స్థాయి అధికారులు ఆదేశాలు జారి చేస్తున్నారు.

కొనుగోలు లక్ష్యం 5.63 లక్షల మెట్రిక్ టన్నులు

ఈ యాసంగి సీజన్‌లో జిల్లాలో 2.90 లక్షల ఎకరాలకు పైగానే రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రధాన ంగా నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువ దిగువన నిజాం సాగర్, బాన్సువాడ, బీర్కూర్, బిచ్కుంద, నస్రూల్లా బాద్, పోచారం ప్రాజెక్ట్ కింద ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాలతో పాటు కామారెడ్డి, దోమకొండ, లింగం పేట తదితర మండలాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో 2.90 లక్షల ఎకరాలకు పైగా వరి పంటను సాగు చేశారు. ఈ లెక్కన 6 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడులు వచ్చే అవ కాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో 5.63 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశాలు ఉన్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొ ంటున్నారు. ఇప్పటి వరకు 4,911 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

సన్నాలు, దొడ్డు రకం వేర్వేరుగా కొనుగోళ్లు

సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇవ్వనున్నందున ఈ సీజన్‌లోనే సన్నాలు, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ యాసంగి వరి ధాన్యం కొనుగోళ్ల కోసం 446 కేంద్రాలను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇందులో సన్నరకం ధాన్యం కొనుగోళ్ల కోసం 64 కేంద్రాలను, దొడ్డు రకం కొనుగోళ్లకు 382 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లలో గతంలో ఏర్పడ్డ ఇబ్బందులు, సమస్యలు అనుభావాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం ప్రణాళికలను రూపొందించారు. పీఏసీఎస్‌లు, ఐకేపీ, మార్కెటింగ్, మహిళా సంఘాల కమిటీల ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి మహిళా సంఘాలకు 183 కొనుగోలు కేంద్రాలను కేటాయించారు. వరి ధాన్యం సేకరణకు 1 కోటి 23 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని అంచనా వేశారు. ఇప్పటికే 62 లక్షల 52 వేల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాలకు అవసరమైన ప్యాడీ క్లీనర్, తేమ శాతం కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాంటలు, గన్నీ సంచులు సిద్ధం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఒక్కో కొనుగోలు కేంద్రం వద్ద ముగ్గురు సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో గతంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఈ అనుభావాలను దృష్టిలో పెట్టుకుని ఏడాది నుంచి ధాన్యాన్ని తరలించేందుకు క్లస్టర్‌లుగా విభజించారు.

మద్దతు ధరకే కొనుగోలు

ఈ సీజన్‌లో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వాలు మద్దతు ధరను ప్రకటించాయి. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి క్వింటాళ్లకు రూ.2320, బీ గ్రేడ్ క్వింటాలుకు రూ.2300 చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నారు. 17 తేమ శాతం ఉన్న వడ్లనే కొనుగోలు చేయనున్నారు. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధరకే వరి ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. ధాన్యాన్ని కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు అధికారులు అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. జిల్లాలో ఇప్పటికే 168 కేంద్రాలను ప్రారంభించారు.

భిక్కనూరులో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు



విద్యార్థులు పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

డీఈవో రాజు

భిక్కనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, విద్యతో పాటుగా క్రీడల పట్ల దృష్టి సారించాలన్నారు. అనంతరం డీఎల్‌పీవో శ్రీనివాస్ మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను ఇష్టంతో నేర్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు డీఈవో, డీఎల్‌పీవో, సెక్టోరియల్ అధికారులు వేణుగోపాల్, రమణారావు, నాగవేందర్, రమేష్, ఎంఈవో, బాలుర పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్ప్రాజోలమే..
కొంప ముంచిందా?

- కల్లులో విచ్చలవిడిగా అల్ప్రాజోలం కలిపి అమ్మకాలు
- తీవ్ర మత్తునిచ్చే పదార్థాలతోనే ప్రజలకు అనారోగ్యం
- జిల్లాలోని కొన్ని కల్లు డిపోల పరిధిలో మోతాదుకు మించి మత్తుపదార్థాల వినియోగం
- ఫిట్స్, మతి స్థిమితం లేకుండా ప్రవర్తించడం లాంటివి ప్రజల్లో కనిపిస్తున్న వైనం
- విచ్చలవిడిగా కల్తీకల్లు తయారు చేస్తున్నా కట్టడి కరువు
- చోద్యం చూస్తున్న జిల్లా ఎక్సైజ్ అధికారులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని కల్లు డిపోల పరిధిలో కలుపుతున్న అల్ప్రాజోలం వల్లనే ప్రజలు అనారోగ్య పాలవుతున్నారా అంటే నిజమనే వాదనలు వైద్య నిపుణుల నుంచి వినిపిస్తున్నాయి. విచ్చలవిడిగా నిషేధిత మత్తుపదార్థమైన అల్ప్రాజోలంను కొన్నిచోట్ల కల్లులో వాడుతున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఆ ఆరోపణలు నిజం అనే విధంగా పోలీసుల తనిఖీల్లోనూ అల్ప్రాజోలం నిల్వలు బయటపడుతున్నాయి. ప్రజలకు హాని కలిగించే మత్తు పదార్థాలను వినియోగిస్తున్న వారిపై నిఘా పెట్టి నిషేధించాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతోనే ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయి. తీవ్రమైన మత్తునిచ్చే అల్ప్రాజోలంను కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్‌లలోని ఆయా మండలాల్లో ఉన్న కల్లు దుకాణాల్లో కలుపుతున్నారనేది జగమెరిగిన సత్యం. ఈ మూడు డివిజన్‌ల పరిధిలోని కొన్ని గ్రామాల పేర్లు ఆయా మండల కేంద్రంలోనూ ఎవరిని అడిగినా చెబుతుండడం గమనార్హం. మత్తునిచ్చే కల్లు తాగేందుకు చీమల దండుల ఉదయం 8 గంటల నుంచే వెళ్తున్న వారిని గమనించి సదరు కల్లు దుకాణంలో విక్రయిస్తున్న కల్లు శాంపిళ్లను సేకరించి పరీక్షలకు పంపితే ఏ మోతాదులో నిషేధిత మత్తుపదార్థం ఉందనేది బయటపడే అవకాశాలు లేకపోలేదు. అయితే నస్రూల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో జరిగిన సంఘటనలో అల్ప్రాజోలమే కలిపారా.. లేదంటే ఇతర మత్తు పదార్థాలు వినియోగించారనే దానిపై అధికారుల విచారణలో బయటపడనుంది. నార్కోటెక్స్ అధికారులు సైతం జరిగిన సంఘటనపై ఆరా తీయడంతో పాటు కల్లులో కలిపిన పదార్థాలపై విచారణ ప్రారంభించారు. అయితే కల్లు తాగి అస్వస్థతకు గురైన వారిలో మొత్తం 64 మంది ఆసుపత్రుల పాలయ్యారు. ఇందులో 14 మందికి సీరియస్‌గా ఉండడంతో నిజామాబాద్ ఆసుపత్రికి రిఫర్ చేయగా మిగిలిన వారు బాన్సువాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.



బాన్సువాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అల్ప్రాజోలమే కారణమా?

జిల్లాలోని కొన్ని కల్లు డిపోల్లో మోతాదుకు మించి మత్తుపదార్థాలు కలుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా నిషేధిత అల్ప్రాజోలం కల్లులో కలుపుతున్నారని సమాచారం. కరోనా సమయంలో కల్లు విక్రయాలు బంద్ కావడంతో వందలాది మంది బాధితులు కల్లు తాగకపోవడంతో వారం రోజుల వ్యవధిలో ఆసుపత్రుల పాలు అయిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో నిద్ర సరిగా పట్టక వింతగా ప్రవర్తించడం, కాళ్లు, చేతులు వంకర పోవడం, పిట్స్ రావడంతో వైద్యులు వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు చేయని ప్రయత్నాలు లేవు. నిద్ర పోవడానికి వైద్యులు ఇచ్చిన మాత్రలు సైతం ప్రభావం చూపలేదు. ఈ సంఘటనలు కల్లు తాగే ప్రతీ ఒక్కరి ఇంట్లో కనిపించిన దృశ్యాలే. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఈ మండలాల్లోని ప్రజలను సైతం మత్తు కల్లు ఎక్కడ విక్రయిస్తారని అడిగితే చాలు ఇట్టే గ్రామాల పేర్లతో సహ చెప్పడంతో పాటు ఆ కల్లు తాగిన వారు చేస్తున్న వింత ప్రవర్తనను కథలు కథలుగా చెబుతున్నారంటే మత్తుకల్లు ఏ విధంగా విక్రయిస్తున్నారో సంబంధిత అధికారులు ఏ విధంగా నిఘా ఉంచారో అర్థం చేసుకోవచ్చు. నిద్రరాని వారికోసం నిద్రవచ్చేలా 0.025 ఎంజీ ట్యాబ్లెట్‌ను వైద్యులు అనేక రకాలుగా ఆలోచించి అందిస్తుంటే కొందరు కల్తీ కల్లు వ్యాపారులు తమ ఇష్టం వచ్చినట్లు అల్ప్రాజోలం వంటి నిషేధిత మత్తు పదార్థాలను కలుపుతున్నారనే వాదనలు పలువురు వైద్యుల నుంచి వినిపిస్తున్నాయి.

ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ అంతంతే..

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో నిషేధిత మత్తు పదార్థాలను వినియోగిస్తున్న వారిపై ఎక్సైజ్‌శాఖ చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు వారి విధుల్లో భాగంగా కల్లు దుకాణాల్లోని శాంపిళ్లను తీసుకుని పరీక్షలకు పంపిస్తుంటారు. తనిఖీలకు వస్తున్నామని ఈ సమయంలో మత్తు పదార్థాలు కలుపని కల్లును శాంపిల్ కోసం ఉంచడం లాంటివి చేయాలని కొందరు సిబ్బంది సూచిస్తుండడంతో తనిఖీల సమయంలో సేకరించిన కల్లులో ఎలాంటి మత్తుపదార్థాలు లేవని ల్యాబ్ రిపోర్టులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అలాంటివి ఏమీ లేదని ఎక్సైజ్ అధికారులు చెబితే కనీసం వారం రోజుల పాటు స్వచ్ఛమైన కల్లు ఆయా దుకాణాల్లో అమ్మకాలు జరిపేలా నిఘా పెడితే వందల సంఖ్యలో కల్లు ప్రియులు ఆసుపత్రుల్లో చేరడం ఇట్టే కనిపించడంతో పాటు అధికారుల పర్యవేక్షణ, పని తనం బట్టబయలు అయ్యే అవకాశం లేకపోలేదు. జిల్లా ఉన్నతాధికారులైన ఇక మీదటైన మత్తుకలిగించే కల్తీ కల్లును విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహిస్తే ప్రజల ఆరోగ్యాలకు మేలు కలుగుతోంది.

హెచ్‌సీయూ భూములు రాష్ట్ర ప్రభుత్వానివే..

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూములు రాష్ట్ర ప్రభుత్వానివని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. హెచ్‌సీయూ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవని బీజేపీ నాయకులు ఇష్టారీతిన మాట్లాడడం సరికాదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ భూములు ఆక్రమించడానికి బిల్లు ప్రవేశపెట్టిందని ఆ భూములను అదాని, అంబానీలకు అంటగట్టాలని కుట్రలు చేస్తుందని అన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. ప్రతీ వ్యక్తి ఖాతాలో రూ.15లక్షలు వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటూ వస్తుందని తెలిపారు. ఇటీవలే సన్న బియ్యం పంపిణీ చేసి దళితులతో కలిసి సహ పంక్తి భోజనాలు చేస్తున్నామని వివరించారు. అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు



రుద్రారంలో రేషన్‌కార్డు లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, వారి హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. టీఎన్జీవోస్ ఎల్లారెడ్డి తాలూకా ఆధ్వర్యంలో మంగళవారం టీఎన్జీవోస్ ఎల్లారెడ్డి తాలూకా కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి శాసనసభ్యుడు మదన్ మోహన్‌రావు, కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, ముల్క నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల కోసం అందుబాటులో ఉండే ఆధునిక సౌకర్యాలతో కూడిన కార్యాలయ భవన నిర్మాణం ఎంతో అవసరమని అన్నారు. త్వరలోనే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, అవసరాల పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ఎల్లారెడ్డి శాసనసభ్యుడు మదన్ మోహన్‌రావు కృషి మరువలేనిదని అన్నారు. ఎల్లారెడ్డి భవన ప్రారంభోత్సవానికి వారి యొక్క తోడ్పాటు చాలా గొప్పదని అన్నారు. అదే విధంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల కృషికి ప్రభుత్వంతో చర్చించాల్సిందిగా ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి తాలూకా అధ్యక్షుడు మహిపాల్, టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, జిల్లా కోశాధికారి ఎం.దేవరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ చక్రధర్, జిల్లా ఉపాధ్యక్షుడు యు.సాయిలు, శ్రావణ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సంతోష్‌కుమార్, ఈసీ మెంబర్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల తాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన అమృత్ 2.0 పథకం కింద 35 కోట్ల వ్యయంతో చేపట్టిన తాగునీరు సరఫరాను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పరిశీలించారు. అధికారుతో ఆయన మాట్లాడి పనుల నాణ్యత, పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకం

రేషన్ కార్డు లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన లబ్ధిదారుడు సాయిలు ఇంట్లో సన్న బియ్యం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ధనవంతుడే కాకుండా పేదవాడు కూడా సన్నబియ్యం తినాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని అన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు గారు హాజరై మాట్లాడారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ప్రదర్శనలు అలరించాయి. 'ఒక పేరు' నీతి కథ మాలిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కళాశాల కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రూ.30 లక్షలు మంజూరు చేశారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా త్వరగా నిర్మించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజిత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయి బాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్ మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ పద్మ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని విస్మరిస్తున్న బీజేపీ ప్రభుత్వం

● ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్



తాడ్‌బిలోలిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్

రెంజల్,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాసే ప్రయత్నం చేస్తుందని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా మంగళవారం తాడ్‌బిలోలిలో గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మండల ఇన్‌చార్జి సుమన్, సాయిరెడ్డి, ధనుంజయ్, సీహెచ్ రాములు, ధనుంజయ్, సాయిరెడ్డి, కుర్మెశ్రీను, యూత్ కాంగ్రెస్ బోధన్ డివిజన్ అధ్యక్షులు కార్తీక్, మండల అధ్యక్షులు గైని కిరణ్, మాజీ సర్పంచ్ గంగాధర్, వ్యాపారి శంకర్, ఖుద్దుస్, నర్సయ్య, బాబు నాయక్, లక్ష్మణ్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, పోశెట్టి, చంటి, అంజాగౌడ్, రామాలయ చైర్మన్ శ్రీనివాస్, అశోక్, శ్రీకాంత్, యోగేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్‌బిలోలిలో చలివేంద్రం ప్రారంభం

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు యోగేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డితో కలిసి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, రామాలయ చైర్మన్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, సాయిరెడ్డి, మండల ఇన్‌చార్జి సుమన్, నర్సయ్య,లక్ష్మణ్,రాంచందర్,తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు



కోటగిరిలో సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న చైర్మన్

కోటగిరి,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కేంద్రం చైర్మన్ నారాయణ పేర్కొన్నారు. కోటగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార కేంద్రం ఏర్పాటు చేశారు. రుద్రూరు సబ్ డివిజన్‌లోని ఐదు సబ్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌కో ఏఈ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలాంటి ఫిర్యాదులు రాకపోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలుంటే రాత పూర్వకంగా తమకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవ లోపం ఉన్న కోరంకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిషన్, రాజాగౌడ్, డీఈ మహ్మద్ ముక్త్యార్, ఏడీఈ నగేష్ కుమార్, ఏఈలు బుజ్జి బాబు, శ్రీనివాస్, గోపి, ఫక్రోద్దీన్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భట్టువాలా బాగ్ సమీపంలో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వ్యక్తికి వెనుక నుండి వచ్చిన మినీ ట్రక్ వాహనం మంగళవారం ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వినయ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా కోయిలకుంట్ల మండల కేంద్రంలోని బొల్లవరం వీధికి చెందిన షేక్ ఇక్బాల్ హుస్సేన్ భాషా అనే 46సంవత్సరాల వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా మండలంలోని బినోల క్రషర్‌లో బ్లాస్టింగ్ యూనిట్‌లో పని చేస్తున్నారు. నవీపేటలో నివాసం ఉంటున్న అతడు మార్నింగ్‌వాక్ వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా భట్టువాలా బాగ్ సమీపంలో నందిపేట నుండి నవీపేట వైపు వస్తున్న మినీ ట్రక్ వాహనం వెనుక నుండి ఢీకొనడంతో షేక్ ఇక్బాల్ హుస్సేన్ భాషా ఎగిరి పక్కనే ఉన్న పొలంలో పడడంతో తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. స్థానికుల సమాచారంతో బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన వివరించారు. మినీ ట్రక్‌ను డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. బాధితుడి భార్య షేక్ షాహీన్ ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్ఎస్ మండల నాయకుడి మృతి

నవీపేట,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండల బీఆర్ఎస్ నాయకులు ఈఎం గంగాధర్(85) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. దివంగత ఈఎం గంగాధర్ భౌతిక కాయానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.రాంకిషన్ రావు జిల్లా నాయకులు భవంతి దేవిదాస్, గిర్ధావర్ గంగారెడ్డి, తెడ్డు పోశెట్టి, మండల అధ్యక్షులు నర్సింగ రావు, డాంగే శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక మహోదయ క్లబ్ తరపున బాధిత కుటుంబానికి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

'నాకు, నాబిడ్డకు న్యాయం చేయాలి'



నడిరోడ్డుపై ధర్నాకు దిగిన అంజమ్మ

రాజంపేట,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):తనకు తనబిడ్డకు న్యాయం చేయాలని మండల కేంద్రంలోని ప్రధానచౌరస్తాలో రాజంపేటకు చెందిన అంజమ్మ మంగళవారం ధర్నాచేపట్టింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనతో జూకంటిమోహన్‌రెడ్డి సహజీవనం చేస్తే కొడుకు పుట్టాడని ఆరోపించింది.గతంలో ఆధార్‌కార్డు, రేషన్ కార్డులో భర్తపేరుగా జూకంటి మోహన్‌రెడ్డి పేరుఉందని, గత నెలరోజుల క్రితం రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుల నుంచి మోహన్‌రెడ్డి పేరు తొలగించి శివరాములు అనే వ్యక్తి పేరును మోహన్‌రెడ్డి మార్పించాడని ఆరోపించింది. తన కుమారుడికి మోహన్‌రెడ్డే తండ్రి అని ఆందోళనకు దిగింది.తనకు న్యాయంచేసేవరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై కుర్చుంది. కానిస్టేబుల్‌లు నచ్చజెప్పె ప్రయత్నం చేసిన వినకపోవడంతో ఎస్ఐ పుష్పరాజ్ ఆమెతో మాట్లాడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దరఖాస్తు ఇస్తే తగిన న్యాయం చేసేందుకు కృషిచేస్తామని ఎస్ఐ తెలిపారు.

రైలు పట్టాలు దాటుతూ ఒకరి మృతి

డిచ్‌పల్లి,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):మండల శివారు రైల్వే స్టేషన్ ప్రాంతంలో 473.7ఏ దగ్గర గుర్తు తెలియన వ్యక్తిని రైలు ఢీకొనడంతో 35ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ని ఢీకొనడంతో గత రాత్రి మృతి చెందాడని స్టేషన్ మేనేజర్ దుర్గాప్రసాద్, తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.నంబర్ 8712658591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించుకోవాలి

మాక్లూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):రైతుల సంక్షేమం కోసం ప్ర భుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించుకోవాని మండల ప్రత్యేక అధికారి ముత్తెన్న అన్నా రు. మంగళవారం మండలంలోని ముత్తెంపల్లి గ్రామంలో కొను గోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండలం రామన్నపేట్ గ్రామంలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి శృతి, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కొనుగోలు సమయంలో రైతులు ధాన్యం నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని తేమశాతం 17కు మించకుండా ఆరబె ట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. వరి మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ.2320, సాధారణ రకం వరిధాన్యం క్వింటాళ్లకు రూ.2300 చొ ప్పున మద్దతు ధర రైతులు పొందాలని సూచించారు. సన్నరకం క్వింటాళ్ల వరిదాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈవిషయాన్ని రైతులు గమనించి మధ్యదళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే దాన్యాన్ని విక్రయించాలని సూచించారు.అనంతరం మోతెగ్రామంలో వరికోత కోసే విధానాన్ని ఆమె పరిశీలించారు. ధాన్యంలో తాలు, మట్టి పెల్లలు, గడ్డి ఉండకుండా నాణ్య మైన దాన్యం పొందవచ్చని రైతులకు, హార్వేస్టర్ యజమానులకు సూచించారు.



ముత్యంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వరిచేను పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే కోయాలని, కోత మిషన్ ఉపయోగించే సమయంలో గ్లోయర్ ఆన్‌లో ఉండాలని కోత మిషన్ ఆర్ పీఎం 18 ఉండాలని, గేర్ స్పోట్ ఏ2 నుంచి బి1 పెట్టి కోత కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శబీర్, సొసైటీ సీఈవో రణవీర్, కొనుగోలు సెంటర్ ఇన్‌చార్జి సురేందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమీక్షా సమావేశం



నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎడపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామాన్ని ప్రజాపాలన పైలట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపిక చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. మంగళవారం ఎడపల్లి మండల అభివృద్ధి అధికారి శంకర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలో 128 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయగా అందులో 16 మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టారని, నిర్మాణానికి ఏర్పడుతున్న ఇబ్బందులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు మొరం, ఇసుక అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమీక్షా సమావేశంలో లబ్ధిదారులు వివరించారు. మొరం, ఇసుక రవాణాకు ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. లబ్దిదారుల ఎంపిక లిస్టులో ఎవరైనా అనర్హులు ఉంటే వారిని గుర్తించి తొలగించి, అర్హత ఉన్న వారికి అవకాశం కల్పించేలా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నివర్తి, పంచాయితీ కార్యదర్శి నాగేష్, ఆర్ఐ జయ ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, బోదన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, విజయేందర్ రెడ్డి, సూరి బాబు, ఇందిరమ్మ లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

రైతులు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

● విండో సొసైటీ డైరెక్టర్ స్వామిగౌడ్

రామారెడ్డి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రైతులు రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో సొసైటీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో డైరెక్టర్ స్వామి గౌడ్ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. విండో సొసైటీ సీఈవో చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నారంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలో భాగంగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని వివరించారు. రైతులు ఎవరు దళారులకు వరి ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని, రైతులకు తగ్గట్టు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం జరుగుతుందని, అదే విధంగా సన్న వరి రైతులకు రూ.500 బోనస్ కూడా ఇవ్వడం జరుగు తుందని వివరించారు. రైతులు ఈ వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోగలరని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో



అన్నారం గ్రామంలో రైతు వేదికను ప్రారంభిస్తున్న సొసైటీ డైరెక్టర్ స్వామిగౌడ్

యువజన కాంగ్రెస్ నాయకులు దయానంద్, గ్రామ ప్రధాన కార్యదర్శి ఎల్లం ఇరబోయిన సత్యం, శంకర్, మైసగౌడ్, షాదుల్, మండ్ల బలరాం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీస్టాల్ నిర్వాహకుడికి ఒకరోజు జైలుశిక్ష

బోధన్‌రూరల్,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని రెంజల్ బేస్‌లో గల టీస్టాల్ యజమాని అబ్దుల్ మాజీద్ సోమవారం అర్ధరాత్రి వరకు టీస్టాల్ నిర్వహించగా హోటల్ నిర్వాహకుడిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించడం జరిగిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఇక నుండి బోధన్ పట్టణంలో రాత్రి 10:30తర్వాత హోటళ్లు, దాబాలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలు మూసివేయాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

ప్రతీ విద్యార్థి సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

సదాశివనగర్,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):చదువుకునే ప్రతీ విద్యార్థి సామాజిక సేవలో భాగస్వామ్యులు కావాలని కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి అన్నారు. మంగళ వారం మర్కల్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీకళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని మర్కల్ గ్రామంలో నిర్వహించారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీనా, గ్రామసెక్రెటరీ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వరిపంటపై రైతులకు అవగాహన



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ

రాజంపేట,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంతో పాటు ఆర్గోండ గ్రామాలలో మంగళవారంవరి పంటలను కామారెడ్డి ఏడీఏ అపర్ణ పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు అవగాహనకార్యక్రమం చేపట్టారు. పొలాల్లో ప్రస్తుతం తెల్లకంకి,మెడవిరుపు కనిపిస్తున్న వరి పొలాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.వీటినివారణకు రైతులు ఎటువంటి మందులు పిచికారి చేయాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ తెల్లకంకిని అరకట్టాలంటే కలుపుతీసిన నెలరోజుల తర్వాత గుళికలు వేసుకోవడం ద్వారా దాన్ని అరికట్టాలని ప్రస్తుతం మందులు పిచికారి చేసిన వీటి నివారణ సాధ్యం కాదని తెలిపారు. వేసవి దుక్కులు బాగా చేసుకుని రాత్రిపూట అక్కడక్కడ మంటల పెడితే రెక్కల పురుగులు అనేవి నాశనం అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రామారెడ్డి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల విద్యార్థులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి మండల విద్యాధికారి ఆనంద్ రావు పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళ వారం వికలాంగుల ప్రభుత్వ విద్యార్థులకు ఫిజియోథెరపీ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రాజు, లక్ష్మణ్, ఐఈఆర్ పి సృజన, సిఆర్ పి. మహముద్ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ గడువు పొడగింపు

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అనధికారిక లేవుట్ యాజమానులు, ప్లాట్ యాజమానులు ఎల్ఆర్ఎస్ క్రమబద్ధికరణను వినియోగించుకోవాలని కమీషనర్ రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020లో రూ.10000,రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నవారు గడువున ఈనెల 30 వరకు పొడగించినందున 25శాతం తగ్గింపు రుసుము చెల్లించి క్రమబద్ధికరించుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులో పేరు,ఫోన్‌నంబర్ తప్పులు ఉన్నచో సవరించుకోవడానికి అవకాశాన్ని ఇచ్చారని తెలిపారు. ఎల్ఆర్ఎస్ స్కీంలో ఏమైన సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఆలూర్ పాఠశాలకు సైన్స్ పరికరాల వితరణ

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్08(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండల కేంద్రంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్‌రెడ్డి రూ. 50వేల విలువ చేసే సైన్స్ పరికరాలను వితరణ చేశారు. మంగళవారం సైన్స్ పరికరాలను ఎంఈవో నరేంధర్‌కు అంద జేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశ్వక్, రాజేశ్, సుబ్బారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వర్నిలో పుస్తకావిష్కరణ

వర్ని,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రం పరిధిలోని మ్యాట్రిక్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రచించిన కథలు, గేయాలు, కవితలు విద్యార్థుల ప్రతిభా పాఠవాలకు సంబంధించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ పుస్తకానికి అన్వేషణ అనే పేరును నామకరణ చేశారు. కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి సాయన్న, బాల సాహిత్య వేదుక జిల్లా అధ్యక్షులు కాసర్ల నరేష్ రావు, డాక్టర్ వరప్రసాద్, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్‌లు పాల్గొని విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. విద్యార్థుల్లో ఉన్న ఆలోచనలు, మెలకువలను బయటకు తీసుకురావాలని అధికారులు పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లం, హిందీ భాషలకు సమ ప్రాధాన్యం ఇచ్చి పిల్లలను చైతన్యపర్చడం అభినందనీయమన్నారు.

ఘనంగా ఎల్లమ్మకు బోనాలు

డొంకేశ్వర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):డొంకేశ్వర్ మండలంలోని అన్నా రం గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బో నంతో నెత్తిపై ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవే ద్యం సమర్పించారు. పిల్లాపాపలు, పంటలు చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో మరో నలుగురు రిమాండ్

వేల్పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన బచ్చు గంగాధర్ ఇంటిని కూల్చివేసిన కేసులో మర్కర్ల నర్సారెడ్డి, ఏనుగు మోహన్‌రెడ్డి , రెక్క రాజేశ్వర్, ఏనుగు నర్సారెడ్డిలను మంగళ వారం అదుపులోకి తీసుకొని కోర్టుకు రిమాండ్ తరలించినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. బచ్చు గంగాధర్ గ్రామంలో అక్రమంగా ఇంటిని నిర్మించారన్న ఆరోపణతో మార్చి 25న ట్రాక్టర్ బ్లేడ్‌తో గ్రామస్థులు కూల్చివేశారన్నారు. బచ్చు గంగాధర్ ఫిర్యాదు మేరకు అదేరోజు ట్రాక్టర్ ఓనర్ రమేష్‌గౌడ్, రాకేష్‌లను రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. అదే కేసులో మార్చి 27 రిక్క ఆనందం, గూడెల్లి ముత్తెన్న, తోపారం రామదాసులను రిమాండ్ చేసినట్లు తెలిపారు. వీరు ఇప్పటికి నిజామాబాద్ జైల్‌లో రిమాండ్‌లో ఉన్నారన్నారు. ఈ కేసు ధర్యాప్తులో బచ్చు గంగాధర్ ప్రభుత్వం నుంచి పట్టాను పొంది ఇంటిని నిర్మించుకోవడంతో పాటు ఆ ఇంటికి గ్రామ పంచాయతీ నుంచి నెంబర్ కూడా పొంది అనుభవదారునిగా ఉన్నారన్నారు. చట్టవ్యతిరేకంగా గ్రామస్థులు ఆ ఇంటిని కూల్చివేయడం పట్ల బచ్చు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని వారందరినీ రిమాండ్‌కు పంపించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

కుల బహిష్కరణ మానవ హక్కుల ఉల్లంఘనే

● జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యులు గన్నారపు శంకర్

మోర్తాడ్ , ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శ్రీరామ నవమి పండగ సందర్భంగా రామాలయంలో పూజలు చేయడానికి వెళ్లిన గౌడ కులానికి చెందిన మహిళలను గ్రామ కమిటీ పెద్దలు ప్రవేశాన్ని నిరోధించడం బాధాకరమని జాతీయ మానవహక్కుల సం ఘం సభ్యులు గన్నారపు శంకర్ మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఆయన తన నిరసనను కూడా వ్యక్తం చేశారు. దేశంలో ఏ ప్రాంతానికి చెందిన హిందువులైన సరే కులంతో సంబంధం లేకుండా ప్రజలను ఆలయంలోకి పూజలు చేయకుండా నిరోధించడం సరికాదని అన్నారు. ఏ మతంలో ఉన్నవారైన పండుగలు జరుపుకోకుండా అడ్డుకోవడం కౄరమైన చర్య అని అన్నారు. కుల బహిష్కరణ, ఆలయంలోకి ప్రవేశాన్ని నిరోధించడం మానవహక్కుల ఉల్లంఘన చట్టరీత్యా నేరం అని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సర్క్యూలర్ రూపంగా గ్రామ పంచాయతీలకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంపై అవగాహన

భీమ్‌గల్‌రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాబానగర్, పురాణీపేట్, దేవక్కపేట, కారెపల్లి, దేవన్‌పల్లి గ్రామాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైభీమ్, జైబాపు, జైసంవిదాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొదిరె స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, కార్యదర్శి బోజాగౌడ్, అనంతరావ్, కోరాడి రాజు, జీవన్, దొన్కంటి కిషన్, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, మల్లేల లక్ష్మణ్, అర్వింద్ పాల్గొన్నారు.

తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

● కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోటగిరి,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం బీజేపీ నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వేముల నవీన్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో క్వింటాకు కిలో తరుగు మాత్రమే తీశారన్నారు. రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా క్వింటాకు రెండున్నర కిలోలు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సహకార సంఘాల పాలకవర్గం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రైస్‌మిల్లర్లు తరుగు పేరుతో రైతులకు నష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సమక్షంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు గజేందర్, శ్రీనివాస్‌రైతులు పాకాల సాయిలు, పోశెట్టి, సాయిప్రసాద్, కాశీరాం, శ్యాం సుందర్, గజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఊరేగింపును ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: ఏసీపీ



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ స్వాములు, భక్తులు నిర్వహించే హనుమాన్ ఊరేగింపు యాత్రను శాంతియుతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. హనుమాన్ జయంతిఊరేగింపులో డీజే సౌండ్ సిస్టం ఉపయోగించరాదని, యువకులు పోలీసులకు సహకరించాలన్నారు. కుల, మతాలకు అతీతంగా పండుగలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలన్నారు. పోలీసుల భారీ బందోబస్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణ, రూరల్ సిఐ విజయ్ బాబు, హనుమాన్ గురు స్వాములు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మానాల మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ముప్కాల్/వేల్పూర్/మెండోర/మోర్తాడ్/భీమ్‌గల్,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ముప్కాల్, బాల్కొండ, చిట్టాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేసుకొని ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందరవి, కొమ్ముల శ్రీనివాస్, ధనుష్, శ్రీకాంత్, అబ్రర్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్‌లో సొసైటీ వైస్ చైర్మన్ బైరిశ్రీధర్, కాంగ్రెస్ నాయకులు గౌరాయి నరేందర్, రమణ, రేవంత్‌రెడ్డి, రాజేందర్, జేమ్స్ గంగారెడ్డి, చరణ్, మధు, గాంధీ, దామోదర్‌గౌడ్, మల్లారెడ్డి, భూ మారెడ్డి, రవి, రాము, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. మెండోరలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, నరేష్, గంగారెడ్డి, రమేష్ శ్రీనివాస్, రాజన్న, రాజేశ్వర్, రాజారెడ్డి, నవీన్, తది తరులు పాల్గొన్నారు. భీమ్‌గల్‌లో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అనంతరావు, జిల్లా కార్యదర్శి భోజాగౌడ్, యువజన ఉపాధ్యక్షులు నాగేంద్ర, బాల్కొండ నియోజకవర్గం యువజన అధ్యక్షుడు చరణ్‌గౌడ్, మండల యువజన అధ్యక్షుడు బద్దం అవినాష్, మహిళ అధ్యక్షురాలు దేశాయి కల్పన, వాక శివప్రసాద్, విక్రం, అరికెల సాయిలు, నాగరాజ్, దొనకంటి కిషన్, జేమ్స్, కిషన్‌కేత్, మండల అధ్యక్షుడు దొన్కంటి రాజేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్‌లోజిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గుండేటి భూమారెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగప్రసాద్, మోర్తాడ్ విడిసి మాజీ అధ్యక్షుడు జక్కం అశోక్, మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు నీరజ్, ఏర్గట్ల మాజీ జడ్పీటిసి రాజేశ్వర్, చొక్కాయి గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో బడిబాట

ముప్కాల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండలంలోని కొత్త పల్లి గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమంలో బాగంగా ఉపాధి హామి కూలీలకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రైవేట్ పాఠశాలకు దీటు గా ప్రభుత్వ పాఠశాలలో విద్యబోధన చేస్తు ఉచిత వసతులు కల్పిస్తున్నామని తమ పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలంటు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్తపల్లి శ్రీనివాస్, అనికేష్ రఘు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వేల్పూర్: మండలం రామన్నపేట్‌లో ముందస్తు బడి బాట కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఉన్నత, ప్రాథమిక పాఠ శాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామంలోని 1, 2 వార్డులలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, మెరుగైన విద్యబోధన గురించి వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్స్‌బుక్స్‌లు, రుచికరమైన మధ్యాహ్న బోజనం, రెండు జతల ఉచిత ఏకరూప దుస్తులు, రాగిజావ, ఆర్‌వో ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యం, 1 నుంచి 5వ తరగతుల విద్యార్థులకు ఏఐ ఆధారిత బోధన, స్మార్ట్ టీవీ ద్వారా డిజిటల్ పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడిమృతి

ముప్కాల్ , ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలోని చెరువులో పడి శివచరణ్(18) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 7వ తేదీన ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాకపోయేసరికి శివచరణ్ కోసం అంతట గాలించారు. చెరువు ఒడ్డుపై ఆయనకు సంబందించిన బట్టలు, చెప్పులు ఉండడంతో చెరువులో పడి ఉంటాడని చెరువులో గాలించగా మృతదేహం లభించింది. శివచరణ్‌కు గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తండ్రి చింతకాయల రవికి నలుగురు కుమారులు కాగా గతంలో ఇద్దరు కుమారులు కాలువలో పడి మృతి చెందారు.ఇప్పుడుపెద్దకుమారుడు శివచరణ్ చెరువు లో పడిమృతి చెందడంతో కుటుంబ సభ్యులుశోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి

రెంజల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):ద్విచక్రవాహనం అదుపు తప్పి మద్దెల మాదారి(41) అనే వ్యక్తి మృతి చెందినట్లు రెంజల్ ఎస్సై చంద్ర మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట మండలం నాగేపూర్ గ్రామానికి చెందిన మద్దెలమాదారి అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో తన అత్త గారి ఊరు అయిన నీలా గ్రామానికి భార్య కోసం వస్తున్న క్రమంలో తాడ్ బిలోలి గ్రామంలో గల రోడ్డుపై అతివేగంతో, అజాగ్రత్తగా తన ద్విచక్రవాహనం వడ్లబస్తాలకు తగిలి రోడ్డు మీద పడడంతో తలకు బలమైన గాయాలు కావడంతో మంగళవారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో చికిత్సనిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికితరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడని ఎస్సైతెలిపారు.కుటుంబసభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అస్తవ్యస్తంగా రాంపూర్ - మల్లాపూర్ రోడ్డు

● గుంతలమయంగా మారిన రోడ్డు ● ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ● రోడ్డు బాగు చేయాలని కోరుతున్న గ్రామ ప్రజలు



మల్లాపూర్‌లో గుంతలు పడిన రోడ్డు

కంకర తేలిన రోడ్డు

ఇందల్వాయి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో బీటీ రోడ్లకు కోట్ల నిధులను విడుదల చేస్తున్నా నిధులన్నీ నీళ్లపాలు అవుతున్నాయి. నాణ్యతాలోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కొన్ని రోజులకే బీటీ రోడ్లన్నీ గుంతలపాలవుతున్నాయి. దీంతో గ్రామీణప్రాంత ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మల్లాపూర్ గ్రామం మండల పరిధికి చివరి గ్రామంగా ఉంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే ఇందల్వాయి నుంచి రాంపూర్ మీదుగా మల్లాపూర్ పోవాల్సిందే. దీంతో రాంపూర్ నుంచి మల్లాపూర్ వరకు రాకపోకలు ఎక్కువగా సాగడంతో బీటీ రోడ్డు గుంతలమయంగా తయారైంది. కొన్ని ఏళ్లుగా వర్షాకాలం వరద ఉధృతికి రోడ్డుగుంతలు పడి బీటీ రోడ్డు తెగిపోయింది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు ఆ రోడ్డు వెంబడి రాత్రి సమయంలో వెళ్లాలంటే జంకుతున్నారు. రాంపూర్ ఎల్లమ్మ మూలమలుపు వద్ద రోడ్డు బాగాలేక పలు ప్రమాదాలు సైతం జరిగాయి. దీంతో గ్రామస్థులు ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతలు పడ్డస్థలంలో ట్రాక్టర్‌తో మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రోడ్డును బాగు చేయాలని పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ప్రయాణికులు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రూ.లక్షలు వెచ్చించి రోడ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో బీటీ రోడ్డు అదోగతి అవుతున్నాయి. ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టి చేస్తున్నా బీటీ రోడ్లు ఆదిలోనే ఉపయోగంలోకి రావడం లేదు. దీంతో రోడ్లన్నీ గుంతలమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రాంపూర్ నుంచి మల్లాపూర్ వరకు బీటీ రోడ్డుకు నిధులు, డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని మల్లాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డు మంజూరు కోసం ప్రయత్నాలు

గతంలో మల్లాపూర్ గ్రామస్థులు రాంపూర్ గ్రామం నుంచి మల్లాపూర్ మీదుగా ఎల్లారెడ్డిపల్లి భారత్‌మాతా వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలుసార్లు గతంలో ప్రజాప్రతి నిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. రాంపూర్, ఎల్లమ్మ మూలమలుపు వద్ద పలు ప్రమాదాలు సైతం జరిగాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం, డబుల్ రోడ్డునిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డు మంజూరు చేయండి

● లోలం సత్యనారాయణ, మల్లాపూర్ గ్రామస్థుడు



బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవ డం లేదు. రాంపూర్ నుంచి మల్లాపూర్ వరకు డబుల్ రోడ్డు కావాలని గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి.


బోరు మరమ్మతులు చేయించుకున్న గ్రామసులు

మొదలైన నీటి కష్టాలు

● గ్రామాల్లో నీరు దొరకక ట్యాంకర్లతో అవసరాలు తీర్చుకున్న గ్రామస్థులు
● లింగంపల్లిలో చందాలు వేసుకుని బోరు వేసుకున్న గ్రామస్థులు

సదాశివనగర్,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని అనేక గ్రామాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు చేతి నుంచి డబ్బులు ఖర్చు చేసి అవసరాలు తీర్చ లేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గ్రామాలలో నీటి కష్టాలు అధికమవుతున్నట్లు గ్రామాలలోని ప్రజలు చెప్తున్నారు. వేసవికాలం వలన ఇంతవరకు పుష్కలంగా నిరందించిన బోర్లు ఎండిపోవడంతో గ్రామాలను ఆదుకున్న మంచి బోర్లలో నీటిసామర్థ్యం తగ్గిపోయింది. ఇంతవరకు గ్రామాలను ఆదుకున్న మిషన్ భగీరథ అధికారుల అశ్రద్ధ వల్ల పలు గ్రామాలకు నీటి సరాఫరా సక్రమంగా జరగకపోవడంతో ముందు రోజుల్లో మరిన్ని నీటి కష్టాలు తప్పవేమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

లింగంపల్లిలో నెలరోజులుగా తిప్పలు

లింగంపల్లి గ్రామంలో గత నెలరోజుల నుంచి నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంటికి రూ. 500 చొప్పున జమచేసుకుని గ్రామానికి సంబంధించిన రెండు బోర్లు మరమ్మత్తులు చేయించుకున్నారు. గ్రామంలో నీటి సమస్యను కొంతవరకు బాగుచేసుకున్నట్లు తెలిపారు. కొత్తగా బోరుబావి తవ్వించమని ప్రజాప్రతినిధుల వద్దకు,అధికారుల వద్దకు వెళ్లినప్పటికి ఎలాంటిఫలితం లేకపోవడం, ఎవరు ఎలాంటి సహాయం చేయకపోవడ ంతో గ్రామప్రజలు వీడీసీ ఆధ్వర్యంలో చందాల రూపంలో ఆర్థిక వనరులు ఏర్పాటు చేసుకుని నీటి దాహం తీర్చుకుంటున్నట్లు తెలిపారు. చాలా గ్రామాలలో నీటి సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారని పలు గ్రామాలతో పాటు లింగంపల్లి గ్రామస్తులు వాపోతున్నారు.

ఇతర గ్రామాల్లోనూ మొదలైన సమస్య

అమర్లబండ గ్రామానికి నీటి సరాఫరా కోసం ధర్మారావుపేట శివారులో వేసిన బోరు నీరు తగ్గిపోవడం, మిషన్ భగీరథ నీరు సమయానికి రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. పంచాయతీ కార్యదర్శి వద్ద డబ్బులు లేకపోవడంతో బోరు బావిలో మరికొన్ని పైపులు దింపలేకపోవడంతో నీటి సమస్య ఎదురవుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. కొన్ని గ్రామాలలో వాటర్‌మెన్‌లకు జీతాలు అందకపోవడంతో నీటి సమస్య కొంత ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అన్ని గ్రామాలలో నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


లింగంపల్లిలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటినితీసుకెళ్తున్న గ్రామస్థులు

10న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

లింగంపేట, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10 విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదికను లింగంపేట విద్యుత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈ విజయసారథి, ఏడీఈ మల్లేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. లింగంపేట మండలంలోని లింగంపేట, శెట్పల్లిసంగారెడ్డి, గాంధారి మండలంలోని గాంధారి, సర్వాపూర్ సెక్షన్‌లకు సంబంధించిన వినియోగదారులు ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. సమయం ఉదయం 10.30 నుంచి ఒంటి గంటవరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించి శాశ్వత నియామకాలు చేపట్టాలి

● భిక్కనూరు సౌత్‌క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్


సౌత్‌క్యాంపస్‌లో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

భిక్కనూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి శాశ్వత నియామకాలు చేపట్టాలని భిక్కనూరు సౌత్‌క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్రకమిటీ పిలుపు మేరకు విధులు బహిష్కరించి అడ్మినిస్ట్రేటివ్ భవనం ఎదుట నల్ల బ్యాడ్జిలు ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రాష్ట్రంలోని విశ్వవిద్యాల యాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను వెంటనే రెగ్యూలరైజ్ చేయాలన్నారు. జీవో నెం. 21 తీసుకువచ్చి కాంట్రాక్ట్ అధ్యాపకుల పొట్టకొట్టడం సరికాదని, గత 20 ఏళ్లుగా విశ్వవిద్యాలయాల్లో పని చేస్తూ వాటి అభివృద్ధికి కృషి చేస్తున్న తమకు అన్యాయం చేయ్యడం ఏమిటని ప్రశ్నించారు. కొందరు ఉన్నతాధికారుల ప్రలోభాలకు తలొగ్గి సరైనా ప్రమాణాలు పాటించకుండా తమకు అన్యాయం చేయ్యడం సరికాదని వెంటనే తమను రెగ్యూలరైజ్ చేయాలని లేనియెడల ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు నారాయణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు యాలాద్రి, సునీత, రమాదేవి, నర్సయ్య, సరిత, నిరంజన్‌శర్మ, శ్రీకాంత్, దిలీప్ పాల్గొన్నారు.



కాలభైరవ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా సింధూర పూజలు

రామారెడ్డి, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్చారణలతో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విధంగా కొందరు వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడిదేవుళ్లకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారెడ్డి ఎస్సై నరేష్, మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంజి సతీష్ గుప్తా, నాయకులు సామల శీలాసాగర్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవునికి దండా రూపంలో రూ.6,500లను దండరూపంలో దేవుని విగ్రహానికి వేశారు. అంతకుముందు ఆలయం వెనుక ఆవరణలో గల బావి నీటితో స్నానాలుచేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో పూజలు నిర్వహించారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా భక్తులు హాజరై కట్నకానుకలు సమర్పించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. కామారెడ్డి తదితరు జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బూర్ల ప్రభు రామచంద్రం గుప్తా, ఆలయ కమిటీ మాజీ చైర్మెనులు, మాజీ ధర్మకర్తలు, పంతులు వంశీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వ్యా పారులు, రాజకీయ నాయకులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

నత్తనడకన కేజీబీవీ నిర్మాణ పనులు!

● వేల్పూర్‌లో ఇరుకు గదుల్లోనే విద్యాబోధన



అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీ పాఠశాల


నిర్మాణంలో ఉన్న కేజీబీవీ భవనం ఇదే..

వేల్పూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాలను ప్రారంభించింది. విద్యార్థులకు విద్యను బోధించడానికి అర్హత కల్గిన ఉపాధ్యాయులు ఉండి చదువు చెప్తున్నా కేజీబీవీలో సరైన సౌకర్యాల్లేక విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలకు సొంతభవనం లేకపోవడంతో గత ఏడు సంవత్సరాలుగా అద్దె భవనంలోనే పాఠశాల కొనసాగుతోంది. చిన్న భవనంలో పాఠశాలను ఏర్పాటు చేయడంతో ఇరుకు గదుల్లోనే విద్యబోధన విద్యార్థినిలకు వసతి కల్పించాల్సి వస్తుంది. 200 మంది విద్యార్థినిలకు హాస్టల్ వసతితో కల్పి 5 గదులే ఉండడం విద్యార్థినులకు అసౌకర్యంగా మారింది.

అటకెక్కిన కంప్యూటర్ విద్యబోధన

10వ తరగతి వరకు ఉన్న ఈపాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థినులకు చదువు నేర్పించాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన కంప్యూటర్లను ప్రభుత్వం మంజూరు చేయగా విద్యబోధన చేయడానికి సరిపడా గదులు, స్థలం లేకపోవడంతో ప్రభుత్వం మంజూరు చేసిన కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ పరికరాలను మూట కట్టి అటకమీద పెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నాయి. పాఠశాల స్థాయి నుంచే కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలని ప్రభుత్వ లక్ష్యం కాగా సౌకర్యాల లేమితో ముప్కాల్ కేజీబీవీ విద్యార్థులకు కంప్యూటర్ బోధన అందకుండ పోతుంది.

చెట్లకింద చదువులు

పాఠశాలలో చాలినంత తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థినులకు చెట్లకింద పాఠాలు బోధించాల్సి వస్తోంది. అడ్వాన్స్ టెక్నాలజీ ఉన్న ఈ సమయంలో చెట్లకింద విద్యబోధన అంటే ఎలా ఉంటుందో సంబంధిత అధికారులకే తెలియాలి. అంతేకాకుండా విద్యార్థినులకు సరైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థునులకు అవస్థలు తప్పడం లేదు. ఇలా ఉండగా కేజీబీవీ పాఠశాలకు సొంతభవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం రూ. 3 కోట్ల 50 లక్షలు మంజూరు చేసింది. పనులు అప్పుడే ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతూ ఇప్పటికి పూర్తికాలేదు. అధికారులు ఇకనైనా స్పందించిన రానున్న విద్యాసంవత్సరం నాటికి పాఠశాల భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకొని విద్యార్థినుల ఇబ్బందులను దూరం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తాం: మురళీ, ఏఈ

కేజీబీవీ పాఠశాల భవనం నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఉన్నాం. రానున్న విద్యాసంవత్సరం నాటికి పనులు పూర్తిచేసి అప్పగిస్తాం.

వరుసగా మోటార్ల కేబుల్ వైర్ల దొంగతనాలు!

● ఆర్థికంగా నష్టపోతున్న రైతులు ● నిఘా పెంచాలని పోలీసులను కోరుతున్న రైతులు


బోరుబావి నుంచి విద్యుత్ కేబుల్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంతంలోని వివిధ గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్నారు. దీంతో స్థానిక రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. గతకొన్ని రోజులుగా ఆర్మూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల విద్యుత్ మోటార్లకు చెందిన కేబుల్‌వైర్లను ఎత్తుకెళ్తున్నారు. తాజాగా ఆలూర్ గ్రామంలో ఆదివారం ఐదుగురు రైతులు నడ్కుడ గంగారెడ్డి ముస్కు శ్రీకాంత్, నడ్కుడ రవి, సింగిడి లింగారెడ్డి, నర్సారెడ్డిలకు సంబంధిం చిన వ్యవసాయ క్షేత్రాల నుంచి విద్యుత్ మోటర్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. గతంలో అంకాపూర్, దేగాం, మచ్చర్ల, పెర్కిట్ గ్రామాల్లో కేబుల్‌వైర్ల దొంగలు తమచేతివాటం ప్రదర్శించారు. ఆలూర్ నుంచి దేగాం వెళ్లే దారిలో రైతుల పంట పొలాల నుంచి నిత్యం కేబుల్ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఏదోఒక గ్రామంలో దొంగతనాలకు పాల్పడుతూనే ఉన్నారు. అంతేకాకుండా విద్యుత్ స్టార్టర్ బాక్సులోని విద్యుత్ పరికరాలను కూడా ఎత్తుకెళ్లారు. అసలే వేసవికాలం సజ్జ పంటకు, కూరగాయల పంటకు నీటి తడులు ఇవ్వాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో రైతుల బోరుబావుల నుంచి కేబుల్ వైర్లను ఎత్తు కెళ్తే రైతుల పంటలు ఎండిపోయే అవకాశం ఉంది.

నష్టపోతున్న రైతులు

గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్ వైర్ల చోరీలకు పాల్పడుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. విద్యుత్ మోటార్ల నుంచి కేబుల్‌వైర్లను దొంగలు కోసుకొని ఎత్తుకెళ్లడంతో రైతులు తమ పంటలకు నీరందించడంలో ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా ఆర్థికంగా నష్టపోతున్నారు. కేబుల్‌వైర్ల చోరీ జరిగిన మోటార్ల వద్ద తిరిగి కేబుల్ వైర్లు వేయడానికి బోరుబావి నుంచి విద్యుత్ మోటార్లను బయటకు తీసి కేబుల్‌వైర్లు వేసిన అనంతరం మళ్లీ బోరు బావిలో దించాల్సి వస్తోంది. ఇందుకు కనీసం చార్జీల రూ పంలో కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా కొత్త కేబుల్ వైర్ల కొనుగోలుకు సుమారు రూ.4వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో రైతుకు ఆర్థికంగా నష్టం కలుగడమే కాకుండా ఇబ్బందులు తప్పడం లేదు.

కేబుల్ వైర్ల దొంగలపై నిఘా పెంచాలి

వరుసగా కేబుల్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడానికి పోలీసులు నిఘాపెట్టాలని రైతులు కోరుతున్నారు. కేబుల్ దొంగలతో రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చోరీచేసిన కేబుల్ వైర్లను కాల్చి అందులోని రాగి తీగలను విక్రయిస్తుంటారు. గతంలో మెండోర, ముప్కాల్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, బాల్కొండ, మోర్తాడ్, ఆర్మూర్ మండలాలలోని వివిధ గ్రామాల్లో గుర్తు తె లియని వ్యక్తులు రైతుల వ్యవసాయ క్షేత్రాల వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి రాగి తీగలను ఎత్తుకెళ్లేవారు. అలాంటి వారిపై పోలీసులు గట్టి నిఘా ఉ ంచి పట్టుకొని జైలుకు పంపడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం సంఘటనలు తగ్గిపోయాయి. అదే విధంగా కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్న వారిపై పోలీసులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేబుల్ వైర్ల చోరీని అడ్డుకట్ట వేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు.


స్టార్టర్ బాక్సు నుంచి విద్యుత్ వైర్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు



కౌలాస్ గ్రామంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

కౌలాస్‌లో కుస్తీ పోటీలు

జుక్కల్/పిట్లం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం కౌలాస్, పిట్లం గ్రామాల్లో శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గ్రామ పెద్దలు కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలో పాల్గొనడానికి మహారాష్ట్ర, కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల నుంచి మల్లయోధులు కుస్తీ పోటీలో బల నిరూపణ నిరూపించి గెలుపొందారు. ప్రతీ సంవత్సరం ఆనవాయితీ మేరకు శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. గెలుపొందిన మల్లయోధులకు నగదు రూపంలో బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో హనుమాన్ స్వాములకు భిక్ష

బీర్కూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం మాజీ సర్పంచ్ కమ్మ సత్యనారాయణ హనుమాన్ స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు. బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు చెందిన హనుమాన్ స్వాములు తరలి వచ్చారు. మొదట స్వాములు ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిట్ల కృష్ణ మహరాజ్ భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. అనంతరం హనుమాన్ స్వాములు భిక్షను చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి గ్రామస్థుల అంత్యక్రియలు

మద్నూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేనూర గ్రామంలో వానరం మృతి చెందగా గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున వానరం అకస్మాత్తుగా శివారు ప్రాంతంలో మృతి చెంది ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు అక్కడి నుంచి గ్రామానికి తీసుకువచ్చి ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అంత్యక్రియలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



మేనూరులో వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

రేపు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడ/బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభకు బాన్సువాడ నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలను తరలించే సన్నాహక సమావేశానికి గురువారం ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ విచ్చేస్తున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ తెలిపారు. ఎస్ఎంబీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశానికి నియోజకవర్గ కార్యకర్తలందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి

బాన్సువాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న సాయిలు (55) గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం విధులు నిర్వహించి స్వగ్రామం దేశాయిపేట్‌లో ఇంటికి వెళ్లిన తరువాత ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన బాన్సువాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

ఎల్లారెడ్డి అభివృద్ధి పనుల కోసం

వంద ట్రాక్టర్ల ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్‌లో అభివృద్ధి పనుల కోసం మండలంలోని గోలి లింగాల్ మంజీరా నది నుంచి వంద ట్రాక్టర్ల ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతులు ఇచ్చినట్టు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్ తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపల్‌లో అభివృద్ధి పనులు సీసీ రోడ్ల నిర్మాణం, సీసీ డ్రైనేజీ నిర్మాణం పనుల కోసం ఇసుక అవసరముందని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ కోరినట్టు ఆయన తెలిపారు. దీంతో గోలి లింగాల్ గ్రామ శివారులోని మంజీరా నది నుంచి వంద ట్రాక్టర్ల ఇసుకను ఎల్లారెడ్డికి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇచ్చినట్టు రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల్లో ఈ ఇసుకను తీసుకెళ్లేందుకు అనుమతులిచ్చినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడంతో సంబంధిత కాంట్రాక్టర్ గోలి లింగాల్ మంజీరా నది నుంచి ఎల్లారెడ్డికి ఇసుకను తరలిస్తున్నారు.



నాగిరెడ్డిపేట బస్టాండ్‌కు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట బస్టాండ్ మరమ్మతు పనులు ప్రారంభం

● రూ. 33 లక్షలు మంజూరు

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. రూ.33 లక్షలతో బస్టాండ్ మరమ్మతు పనులు మంజూరయ్యాయి. నాగిరెడ్డిపేట ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు గత ఏడాది కాలంగా ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. బస్టాండుకు మరమ్మతు పనులకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మిస్తామని మదన్ మోహన్ రావు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బస్టాండ్ మరమ్మతులకు రూ.33 లక్షలను మంజూరు చేయించినట్టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ తెలిపారు. పనులను నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. బస్టాండ్ మరమ్మతులకు నిధులు మంజూరు కావడం, మరమ్మతు పనులు ప్రారంభం కావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

చైర్మన్ కమలాకర్‌రావు

సదాశివనగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని చైర్మన్ కమలాకర్‌రావు అన్నారు. మండలంలోని తిర్మన్‌పల్లితో పాటు మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించుకొని మోసపోకుండా ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రవేశపెట్టిందన్నారు. వరి ధాన్యం ఏ గ్రేడ్‌కు రూ.2320, బీ గ్రేడ్‌కు రూ.2300 చెల్లింస్తుందన్నారు. రైతులు 17 శాతం తేమ వచ్చే విధంగా ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు రైతు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ ప్రతులను కొను గోలుకు నిర్వాహకులకు అందజేస్తే సత్వరమే డబ్బులు రైతు అకౌంట్లలో జమ అవుతాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సిబ్బంది రైతులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యానాయక్, ఏవో ప్రజాపతి, సహకార క్లస్టర్ అధికారి లక్ష్మణ్, ఏఈవో కవిత, సీఈవో విగ్నేష్‌గౌడ్, డైరెక్టర్‌లు బాల్‌రెడ్డి, బాబయ్య, నర్సారెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నారాయణ, రాజయ్య, సంజీవ్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: రబీ సీజన్‌లో రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలని సహకార సంఘం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోచారం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ ఉత్పత్తులను దళారులకు అమ్ముకోకూడదనే ఉద్దేశ్యంతో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వ రి ఏ గ్రేడ్ రకానికి 2320, బి గ్రేడ్ రకానికి రూ.2300 చెల్లిస్తామన్నారు. గత సీజన్‌లో కూడా పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం తరఫున ధాన్యం కొనుగోలు చేసి త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు చెల్లించడం జరుగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ డైరెక్టర్లు నాగిరెడ్డి, సీఈవో సందీప్, నాయకులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని పొల్కంపేటలో శెట్పల్లి సంగారెడ్డి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎన్‌డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ కుమారస్వామి, సీఈవో శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఐకేపీ ఆధ్వర్యంలో లింగంపేట, ఐలాపూర్, శెట్పల్లిలో మంగళవారం యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత ప్రారంభించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు క్వింటాలుకు ఏ గ్రేడుకు రూ.2320 చెల్లిస్తుందని ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రంలో విక్రయించిన రైతులకు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని ఆయన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి రఫీ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, నాయకులు అఫ్రోజ్, పూల్‌సింగ్, గోపాల్, లక్ష్మీనారాయణలతో పాటు నాయకులు ఉన్నారు.

నిజాంసాగర్: మండల కేంద్రంలోని వడ్డేపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలే మల్లికార్జున్‌లు ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వడంతో పాటు రైతులు రికార్డుస్థాయిలో వరి పండించారని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ప్రజా పండరి, ఏపీఎం రామ్, నారాయణగౌడ్, సీసీ బి.సాయిలు, గ్రామ సంఘం అధ్యక్షురాలు ఖైరున్ బీ, కార్యకర్తలు, గ్రామస్థులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని ముత్యంపేట సింగిల్ విండో పరిధిలోని ముత్యంపేట, చింతమాన్‌పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించినట్లు విండో చైర్మన్ కోడిప్యాక తిరుపతిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బక్కారం సిద్ధరాములు, డైరెక్టర్‌లు నారాగౌడ్, సిద్ధాగౌడ్, రామాగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, సీఈఓ రాంచంద్రం, క్లర్క్ శ్రీనివాస్, సార్ల నర్సింలు, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి విండోతో పాటుగా విండో పరిధిలోని కంచర్ల, బాగిర్తిపల్లి, ఇసన్నపల్లి గ్రామాల్లో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని విండో చైర్మన్ బాలగొని రాజాగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ స్వామి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, ఏవో శోభ, విండో సీఈవో మోహన్‌గౌడ్, ఏఈవో లత, విండో డైరెక్టర్లు, సిబ్బంది, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం



వడ్డేపల్లిలో..



ముత్యంపేటలో..



భిక్కనూరులో..

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ/బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై వైద్యుల చేత ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ కల్లు తాగి సుమారు 60 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ఇలాంటి కల్లు తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మత్తుమందుతో ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందని, కల్తీ కల్లు జోలికి వెళ్లొద్దని సూచించారు. ఘటన జరిగిన రోజు స్థానిక నాయకులు అందుబాటులో ఉండి బాధితులకు వైద్యం అందించాలని, కాసుల బాలరాజు రాత్రి వరకు ఆసుపత్రిలోనే ఉన్నాడని తెలిపారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్తీ కల్లు కూడా డ్రగ్స్‌లో భాగమేనని, ప్రజలు ఇలాంటి కల్తీ కల్లుకు దూరంగా ఉండాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి ఏజాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శించిన బీజేపీ నాయకులు

బాన్సువాడ టౌన్: కల్తీ కల్లు కారణంగా బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం బాన్సువాడ బీజేపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్తీ కల్లు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ , శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, సాయిరెడ్డి, పాశం భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు



అంకోల్‌లో వివరాలు సేకరిస్తున్న వైద్యశాఖ అధికారులు

కల్తీ కల్లు బాధితుల వివరాల సేకరణ

నసురుల్లాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురి అయిన ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనికి కారణమైన కల్లు నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంకోల్, దుర్కి, దామరంచ గ్రామాల్లో పలువురి కల్లు మాముల నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామాలకు కల్లు సరఫరా చేస్తున్న వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. మంగళవారం సంబంధిత కల్లు డిపోను సీజ్ చేసి వందల లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. అంకోల్, దుర్కి, అంకోల్ తండా గ్రామాల్లో వైద్యశాఖ శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతీ ఇంటికి తిరుగుతూ బాధితుల వివరాలు సేకరించి వారి ఆరోగ్య పరిస్థితిలను నమోదు చేసుకుంటున్నారు.

కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు

● ఎక్సైజ్ డీసీ సోమిరెడ్డి

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్‌శాఖ డీసీ సోమిరెడ్డి అన్నారు. బాన్సువాడ ఎక్సైజ్ శాఖ పరిధిలోని నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో జరిగిన కల్తీ కల్లు ఘటనపై మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన వారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. కల్లు నమూనాలను సేకరించి ల్యాబ్‌కు తరలించినట్లు, వచ్చిన ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. కల్తీ కల్లుకు కారణమైన సురేందర్‌గౌడ్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బస్వాపూర్‌లో ఆటోను ఢీకొన్న కారు

● ఆటో డ్రైవర్‌కు గాయాలు

భిక్కనూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొనగా ఆటో రోడ్డుపై బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికలు కథనం ప్రకారం.. బస్వాపూర్ గ్రామానికి చెందిన మంద స్వామి తన ఆటోలో మెదక్ జిల్లా రామాయంపేట నుంచి బస్వాపూర్‌కు వస్తుండగా అదేవైపు వెళ్తున్న కారు వెనుకాల నుంచి ఢీకొనడంతో ఆటో జాతీయ రహదారిపై బోల్తా పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో రోడ్డుపై ఇరువైపుల ట్రాఫిక్ జాం కాగా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆటోను పక్కకు జరిపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన ఆటో డ్రైవర్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బంగారు దుకాణంలో దొంగతనం

పిట్లం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఇందిరాగాంధి కూడలి వద్ద గల నర్సింహ బంగారు దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు దుకాణం నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం దుకాణం యజమాని షాప్ తీయగా బంగారు, వెండి వస్తువులు లేక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి



బస్వాపూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జుక్కల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం బస్వాపూర్ మందాబాద్ గ్రామాల్లో మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ దేశాయ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగం మేరకు ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను మంగళవారం మండల కేంద్రంలోని మంగ్లూరు, నర్సింగరావుపల్లి, వెలుగునూరు, వడ్డేపల్లి, జక్కాపూర్, మల్లూరు గ్రామాల్లో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, అభియాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత, కలిసికట్టుగా పోరాడుదాం, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని అంబార్‌పేట గ్రామంలో గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, అబ్రబోయిన స్వామి, రామస్వామిగౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు ఉద్యమించాలన్నారు. మహాత్మాగాంధీ అంబేద్కర్ ఆశయం సర్వమత సమానమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటే దేశ ప్రజల జీవన స్థితిగతులు ప్రగతివైపు పయనించడం ఖాయామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజం, గోపాల్‌రెడ్డి, నల్లపు శ్రీనివాస్, శంకర్ రెడ్డి, సీతారాం మధు, వినీత్, సంతోష్‌రెడ్డి, షమ్మీ, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, జనార్ధన్‌రెడ్డి, రాజయ్య, సంజీవ్, రాజేందర్, రాజు, నయీం, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం


కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని వీటీ ఠాకూర్ కంటి ఆసుపత్రి, ఆర్‌వీఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత క్యాన్సర్ చికిత్స అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్ని రకాల క్యాన్సర్ చికిత్సలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. జనరల్ సర్జరీలో అర్షమొలలు, వరి బీజం, బీజకుట్టు, గడ్డలు, అపెండెక్స్, థైరాయిడ్ మొదలైన ఆపరేషన్లు ఉచితంగానే చేస్తారని తెలిపారు. కామారెడ్డిలోని గోదాం రోడ్డులోని వీటి ఠాకూర్ కంటి ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హరితసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మనీష్‌రెడ్డి

మహమ్మద్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హరితసేన జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మనీష్‌రెడ్డి నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ శ్రీనివాస్, హరితసేన కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మొక్కలు విరివిగా నాటి భావితరాలకు మనవంతుగా ఆరోగ్యాన్ని అందించాలని సూచించారు. మన ఇంట్లోని పిల్లలు కూడా చెట్లు నాటే కార్యక్రమం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మానవ మనుగడకు పచ్చనిచెట్లు ఎంతో అవసరమని తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మండల పంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వేసవిలో ఎండలు ముదిరినందున గ్రామాల్లో ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో కంపోస్టు షెడ్ల వినియోగం, పల్లె ప్రకృతి వనం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల సర్వే, ఎల్‌ఆర్ఎస్, ఈనెల 14న గ్రామసభల నిర్వహణ, తదితర అంశాల గురించి సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - రాబిన్ హుడ్
ప్రియా 70 - స్టేట్ వర్సెస్ నోబడి
ప్రియా 35 - శారీ

బాన్సువాడ

మహేశ్వరి - మ్యాడ్ స్క్వేర్
వెంకటేశ్వర - ధీర వీర శూర



చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

